క్లుప్తంగా

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



పేదలతో దరఖాస్తులు పూర్తి చేయిస్తున్న సీపీఐ నేతలు

భీమవరం: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ పేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు సొంతంగా భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోలేరని పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎం.లక్ష్మీపతి, ఛాన్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీ దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమి సందర్భంగా మెంటేవారి తోటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారికి 9 రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన గణేశుల ఆనంద్, ఉమాదేవి దంపతులు, లీలా శివనాగ ధనరాజ్, కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి పరామర్శ

భీమవరం: రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలైన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను గురువారం భీమవరంలోని నివాసంలో పలువురు నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో సోము వీర్రాజు, గ్రంధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రపురం బ్రిడ్జికి రెయిలింగ్ నిర్మించాలి

భీమవరం అర్బన్: మండలంలోని తోకతిప్ప–నాగేంద్రపురం గ్రామాల మధ్య యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపుల రెయిలింగ్, అప్రోచ్ నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతేడాది వంతెనపై నుంచి ప్రమాదవశాత్తు కాలు జారి యనమదుర్రు డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్‌లు లేకపోవడంతో వాహనాలు రాకపోకలు తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామస్తులు సేద తీరేందుకు వంతెనపై కూర్చుంటున్నారు. ప్రమాదవశాత్తు కొంతమంది పడిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే బ్రిడ్జికి రెయిలింగ్, అప్రోచ్‌లు నిర్మించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

వ్యర్థాలను నేరుగా డ్రెయిన్లలో కలపొద్దు



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: హోటళ్లు, రెస్టారెంట్ల వ్యర్థాలను నేరుగా డ్రెయిన్లలో కలపొద్దని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. హోటళ్ల నుంచి నేరుగా డ్రెయిన్లలోకి వ్యర్థాలను వదిలేయడం వల్ల మురుగు పారుదలకు ఆటంకాలేర్పడుతున్నట్టు చెప్పారు. మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ తదితరులు ఉన్నారు.

మందుల పంపిణీ



మందులను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వాకర్స్ క్లబ్ సాయం అందించింది. గురువారం పట్టణం, యలమంచిలి మండలం ఊటాడ గ్రామానికి చెందిన ముగ్గురు రోగులకు రూ.15 వేలు విలువ చేసే మందులను అందించింది. క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, క్లబ్ సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు పాల్గొన్నారు.

పాత భవనానికి కొత్త రంగులు

- శిథిలమైన పీహెచ్‌సీ భవనానికి కొత్త హంగులు
- మధ్యలోనే నిలిచిపోయిన పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2 కోట్లు మంజూరు
- తొమ్మిది నెలలు గడిచినా పట్టించుకోని కూటమి సర్కార్



మధ్యలో నిలిచిన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు



శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ భవనం



రంగులు వేసిన పీహెచ్‌సీ పాత భవనం

కాళ్ల: శిథిలావస్థలో ఉన్న కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి కొత్త రంగులు వేసి రంగులు వేశారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. శ్లాబులు పాడైపోయి ప్రమాదభరితంగాఉన్నా ఇప్పటివరకు వైద్యులు భయంతో వైద్య సేవలను అందించారు. కనీసం ఆసుపత్రి భవనానికి రంగులు వేసి 20 ఏళ్లు అవుతుందని చెబుతున్నారు. కాని ప్రస్తుతం ప్రభుత్వఆసుపత్రి వైద్యులుగా పని చేస్తున్న సరాబు సునీల్ ఒక్క అడుగు ముందుకేసి ప్రభుత్వం అందిస్తున్న అరకొర నిధులతోపాటు దాతల సహకారంతో ఆసుపత్రిని సుందరంగా తీర్చిదిద్దేందుకు పాట్లుపడుతున్నారు. దాతల సహకారంతో ఆసుపత్రిలో బెడ్లు, ఫ్యాన్లు, వాటర్ ఫిల్టర్, ఆవరణలో బెంచీలతో పాటు శిథిలావస్థకు చేరిన శ్లాబ్‌నుంచి నీరు లీకవ్వకుండా దాతల సహకారంతో శ్లాబ్ అభివద్ధి పనులతోపాటు పలు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ఆసుపత్రికి విద్యుత్ సౌకర్యంతో పాటు రంగులువేసి ఆసుపత్రి రూపురేఖలను మార్చివేశారు. ఆసుపత్రి అభివృద్ధికి వైద్యులు వైద్యా ధికారులు చర్యలు తీసుకోవడంతో వారిని మండలంలోని పలువురు పెద్దలు అభినందిస్తున్నారు. ఈ చొరవకు ప్రభుత్వ సాయం తోడైతే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నిలిచిన నూతన భవన నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణ పనులు చేపట్టి, బేస్‌మెంట్ లెవెల్‌కు చేర్చారు. తరువాత కారణాలేమైనా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ పనుల ఊసే ఎత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఇప్పటివరకు దీనిపై ఏవిధమైన చర్యలు తీసుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిలిచిన పనులను పూర్తిచేసి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

బేస్‌మెంట్ లెవెల్లో ఆగిన నూతన భవన నిర్మాణానికి జిల్లా వైద్యశాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. అంతే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్లాం. చర్యలు తీసుకుంటానని తెలిపారు.

– సరాబు సునీల్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, కాళ్ల

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ



బస్‌పాసులను పంపిణీ చేస్తున్న అల్లాడి నటరాజు

ఆకివీడు: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై బస్‌పాసులను పంపిణీ చేసిందని దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు చెప్పారు. స్థానిక కొత్త బస్ స్టాండ్ వద్ద గురువారం దివ్యాంగులకు బస్‌పాసులను ఆయన పంపిణీ చేశారు. బస్ పాసులు పొందని వారు ఆధార్, సదరన్ ధృవపత్రాలు, పాస్‌పోర్టు ఫోటోతో దరఖాస్తును అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాగమణి, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిదులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమంటున్న ఎండలు

ఆకివీడు: వేవిని తలపిస్తూ గురువారం మండుటెండలు భగ్గుమన్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఆపసోపాలు పడ్డారు. రోడ్లపైకి జనం రావడానికి బెంబేలెత్తిపోయారు. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో పాటు మధ్యాహ్నం భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గాలిలో తేమ శాతం కొంత మేర ప్రజలను కాపాడింది. మధ్యాహ్నానికి 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

విద్యార్థులకు తాగునీటి కష్టాలు



ట్యాంకు నీరు తాగుతున్న విద్యార్థులు



మూతపడిన ఆర్‌ఓ ప్లాంట్

కాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి నీటి కొరతతో విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ రిపేర్ రావడంతో ఎన్నో ఏళ్ల క్రితం కుళాయి ద్వారా వచ్చే నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్‌పై ఆధార పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ ట్యాంక్ శుభ్రం చేసి ఎన్నో సంవత్సరాలు అవుతుందని అందులో నీరు ప్రస్తుతం చేతులు కడుగుకోవడానికి వాడుతున్నారని, ఆ నీరు త్రాగితే పిల్లలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. విద్యార్థులు దాహం తీర్చుకునేందుకు ఇంటి నుంచి బాటిళ్లతో నీటిని తెచ్చుకుంటున్నా, ఆ నీరు అయిపోతే కలుషిత ట్యాంక్ నీటిపైనే ఆధార పడాల్సి వస్తుందని పిల్లలు చెబుతున్నారు. సుమారు మూడు నెలల క్రితం పాడైన ఆర్‌ఓ ప్లాంట్ ఇంకా ఎందుకు బాగుచేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నా కనీసం ప్రత్యామ్నాయం కూడా చూపకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కాళ్ల ఎంఈఓ ఎ.రవీంద్రను వివరణ కోరగా పాఠశాలలో కచ్చితంగా విద్యార్థులకు తాగునీరు ఉండాల్సిందేనని, పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయకపోతే ప్రత్యామ్నాయంగా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫిబ్రవరి జీతాలు చెల్లించాలి

భీమవరం: సమగ్రశిక్షా ఉద్యోగులకు ఫిబ్రవరి నెల వేతనాలు నేటికీ చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్, పి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల మంది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని ఇప్పటికే చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న వారి ఫిబ్రవరి జీతాలు ఇవ్వకపోవడంతో మరింత ఇబ్బంది పడుతున్నారన్నారు. జీతాలు సక్రమంగా అందక అప్పులు పాలై దుర్భర జీవితాన్ని వెళ్లదీస్తున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు తక్షణం చెల్లించాలని శ్రీనివాస్, సుబ్బారావు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: బంటుమిల్లి ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయునట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో పెన్నాడ, శృంగవృక్షం, బంటుమిల్లి, పెన్నాడపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఆకివీడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా 14వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు, అజ్జమూరు, గుమ్ములూరు రోడ్డుల లోని అన్ని ఫీడర్లకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు 903 మంది విద్యార్థులు

ఆకివీడు: మండలంలో పదో తరగతి పరీక్షలకు 903 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఈఓ రవీంద్ర గురువారం చెప్పారు. మండలంలోని చిన కాపవరం, ఆకివీడు జెడ్పీ హైస్కూల్, నారాయణ, సెంట్ ఎలోషియస్ స్కూళ్లలో 602 ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు, 301 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించినట్లు ఎంఈఓ వివరించారు. సకాలంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఆయా కేంద్రాలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

యలమంచిలి: ఇలపకుర్రు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 నంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ కొండేటి జీవరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఇలపకుర్రు, పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలకు తిలోదకాలు



డ్రెయిన్‌ను అనుకుని వేస్తున్న బోరు

కాళ్ల: ఆక్వా సాగులో ఉప్పునీటి బోర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో అక్రమ బోర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కాళ్ల మండలం కోపల్లె గ్రామ పరిధిలో పరాలమ్మ గుడికి వెళ్లే దారిలో బొండాడ డ్రెయిన్ గట్టును ఆనుకుని ఎటువంటి అనుమతులు లేకుండా ఉప్పునీటి బోరు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో బోర్లు వేస్తున్నారని అందుకే అధికారులు అటువైపు చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉప్పునీటి బోర్లు వలన భూగర్భ జలాలు పాడై పర్యావరణానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న ఉప్పునీటి బోర్లను వెంటనే సంబంధిత శాఖ అధికారులు అడ్డుకొని చర్యలు తీసుకోవాలని రైతులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

పంట కాలువలో జంతు కళేబరాలు



పంట కాలువలో కొట్టుకొస్తున్న జంతు కళేబరాలు

భీమవరం అర్బన్: మండలంలోని కాళీపట్నం ఛానల్‌లో జంతు, కోళ్ల కళేబరాలు కొట్టుకురావడంతో దిగువ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛానల్ భీమవరం పట్టణంనుంచి యనమదుర్రు, దిరుసుమర్రు, రామాయణపురం, నాగిడిపాలెం గ్రామాల మీదుగా మొగల్తూరు మండలంలోని కాళీపట్నం పంచాయతీలోని పలు గ్రామాలకు వెళుతుంది. ఛానల్‌ను ఆనుకుని వేలాది వరి, చేపలు, రొయ్యలు చెరువులకు, గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులకు సాగు, తాగునీరు అందిస్తుంది. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మృతి చెందిన కోళ్లు, జంతు కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. దీంతో ఛానల్ పరివాహక గ్రామస్తులు ఆ నీటిని తాగితే వ్యాధులు ప్రబలుతాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాలువలో కోళ్లు, జంతు కళేబరాలు, చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

భీమవరం (ప్రకాశంచౌక్): చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదని, ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. భీమవరం జేపీ రోడ్డులోని ఆనంద బ్లడ్ బ్యాంక్ వీధిలో ప్రియాంక స్కిన్ కేర్ సెంటర్ వద్ద పౌర్ణమి సందర్భంగా గురువారం ఉచిత చర్మ సంబంధిత వ్యాధుల శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. చర్మంపై ఎక్కడైనా, ఏదైనా తేడా కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని, ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ చర్మ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తిస్తే త్వరగానే నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం 112 మందికి ఉచిత చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. డీటీడీసీ బాబు మాట్లాడుతూ ప్రతి నెలా పౌర్ణమి రోజున రాఘవరాజు ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సాయంత్రం హోమం చేస్తున్నామని అన్నారు. పీఎస్ఎన్ రాజు, వైద్యులు పాల్గొన్నారు.

హామీల అమలును విస్మరించిన సర్కార్

నరసాపురం: ఎన్నికల హామీల అమలును కూటమి సర్కార్ పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నేత కర్రి ఏసుబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులతో కలెక్టరేట్ల వద్ద నిర్వహించిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. కూటమి సర్కార్‌పై ఎనిమిది నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారని, నిరుద్యోగభృతి, ఉచిత బస్సు హామీ ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజుల్లో వేట నిషేధం అమల్లోకి రాబోతుందని, ఏడాదైనా మత్స్యకార భరోసా అమ లు చేస్తారో లేదో కూటమి నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ సర్కార్ బీసీల సంక్షేమానికి అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



చెరుకువాడ అర్తమూరు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు లేని మలుపు ప్రదేశం

ఉండి: నిత్యం ప్రయాణించే రహదారే అయినా ప్రమాదం ఏళ్ల తరబడి పొంచి ఉంది. ఏ రోజు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అర్తమూరు గ్రామ ప్రజలు ప్రయాణం కొనసాగిస్తున్నారు. అర్తమూరు నుంచి మండల కేంద్రానికి సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, వ్యాన్లలో ప్రయాణిస్తుంటారు. అయితే అర్తమూరు, చెరుకువాడ గ్రామాల సరిహద్దు మలుపులో ఏళ్ల తరబడి ఓ ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ప్రవహిస్తున్న పంటబోదెకు ఎటువంటి కల్వర్టు(రక్షణగోడ) లేకపోవడంతో ప్రతి రోజూ ప్రయాణించే వందలాది మంది దానిని దాటి వెళుతున్నారు. విద్యార్థులు సుమారు 2 కిలోమీటర్లు ప్రయాణించి సమీప గ్రామమైన చెరుకువాడలోని జెడ్పీ హైస్కూల్‌కు, ఉండి, భీమవరం, ఆకివీడు ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూళ్లకు వెళుతుంటారు. ఇదే మలుపులో గతంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎన్నో ప్రమాదాలకు గురయ్యాయి. రాత్రి వేళల్లో అయితే ప్రమాదాలు జరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా కల్వర్టు నిర్మిస్తే బాగుంటుందని ప్రస్తుత పాలకులు, అధికారులు ఈ ప్రమాదంపై దృష్టి సారించాలని స్థానిక విద్యార్థులు కోరుకుంటున్నారు. శివారు ప్రాంతం కదా అని ఎన్నికల కోసమే కాకుండా అభివృద్ధి చేసేందుకు తమ గ్రామానికి రావాలంటూ ప్రజలు అధికారులు నాయకులకు విన్నవించుకుంటున్నారు.

దయచేసి పట్టించుకోండి

ప్రమాదం జరిగే వరకు ఎదురు చూడకుండా అధికారులు, నాయకులు కల్వర్టు నిర్మాణంపై దృష్టి సారిస్తే బాగుంటుంది. ఏదో జరిగిన తరువాత హడావుడి చేసి నివారణ చర్యలు చేపట్టడం కంటే ముందుగానే మేల్కొని చర్యలు తీసుకోవడం మంచిది. అధికారులు స్పందిస్తారని ఎదురు చూస్తున్నాం.

– గోనబోయిన రామదాసు, అర్తమూరు

రాత్రి వేళల్లో మరింత ఇబ్బంది

ఈ ప్రాంతంలో రాత్రి వేళల్లో మరింత ఇబ్బందిగా ఉంటుంది. మలుపును అర్థం చేసుకోని కొందరు వాహనదారులు కాలువలో పడిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎన్నో ప్రమాదాలు సంభవించాయి. కాబట్టి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అధికారులు కల్వర్టు నిర్మాణం చేపడతారని ఆశపడుతున్నాం.

– పోతుల ఆదాము, అర్తమూరు

ఎన్ఏఏటీలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

భీమవరం: దేశ వ్యాప్తంగా గత నెల 7వ తేదిన నిర్వహించిన నేషనల్ ఎనలైటికల్ ఆటిట్యూడ్ టెస్ట్ (ఎన్ఏఏటీ)లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు చెప్పారు. తమ స్కూల్ ఆరో తరగతి విద్యార్థి ఎస్.వైష్ణవి నాగసాయి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.25 వేలు నగదు బహుమతి గెల్చుకున్నట్లు తెలిపారు. అలాగే ఎం.లిఖితాదేవి, ఐఎస్‌పీ క్రాంతివర్మ, ఎంపీపీ సాయిశంకర్ జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించగా, ఎన్ఎస్ఎంఎస్‌డీపీ వీర, ఎం.అజయ్ జైసార్య, జె.దివ్యపావని రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. విజేతలకు ఏప్రిల్‌లో న్యూఢిల్లీలో నిర్వహించే అవార్డు ప్రధానోత్సవంలో బహుమతులు అందజేస్తారన్నారు. టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకోడేరు: మండలంలోని బీసీ/కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకానికి 2024– 25 సంవత్సరాలకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి బీసీ, కాపు కార్పొరేషన్, కాపు కమ్యూనిటీకి సంబంధించి స్వయం ఉపాధి పథకం, జనరిక్ ఫార్మసీలు పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేయుటకు అర్హులైన బీసీ, కాపు కార్పొరేషన్ లబ్ధిదారుల గుర్తింపు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగి, అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 22 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత నకలు పత్రాలు, పాస్‌పోర్ట్ ఫొటో జత చేయాలన్నారు.

'స్వర్ణాంధ్ర'కు పరిశోధనా కేంద్రం

నరసాపురం రూరల్: రాష్ట్రంలో పేరెన్నికగన్న స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు 2025–26, 2026–27 విద్యాసంవత్సరాలకు జేఎన్‌టీయూ కాకినాడ పరిశోధనా కేంద్రం మంజూరయినట్టు యాజమాన్యం తెలిపింది. గురువారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ పరిశోధనలు చేసే విద్యార్థులు, అధ్యాపకులకు ఈ పరిశోధనా కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సెంటర్ రావడం సువర్ణావకాశమని, మైలురాయివంటిదని కళాశాల కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అద్దాల శ్రీహరి తెలిపారు.